ఈనాడు
నిర్మల్
బుధవారం సెప్టెంబరు 25, 2024

అవకాశాలు అందిపుచ్చుకోండి: కలెక్టర్


ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కలెక్టర్ అభిలాషఅభినవ్, ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ, ఆర్డీఓ కోమల్‌రెడ్డి

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ విద్యార్థులు కష్టపడి చదివి, అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ అభిలాషఅభినవ్ విద్యార్థులకు సూచించారు. బాసర ఆర్జీయూకేటీలో మంగళవారం నిర్వహించిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవంలో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. తాను ఇంజినీరింగ్ విద్యార్థి నుంచి ఐఏఎస్ అధికారిగా ఎదిగిన తీరును విద్యార్థులకు వివరించారు. బాసర ఆర్జీయూకేటీ ప్రత్యేక విద్యాలయమని, దానికి విద్యార్థులే అంబాసిడర్లుగా వెలుగొందాలని పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్, సర్వీసెస్, బీమా రంగాల్లో ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం వినూత్న కోర్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు కలెక్టర్ ధ్రువీకరణ పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం ప్రాంగణాన్ని కలియతిరిగారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణతో కలిసి విద్యార్థుల పురోగతిపై చర్చించారు. కంప్యూటర్ విద్యార్థులు రూపొందించిన హెల్త్ ప్రొఫైల్ యాప్‌ను వీక్షించారు. ఈ యాప్‌ను జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, వసతి గృహాలను అనుసంధానించేందుకు కృషి చేయాలని విద్యార్థులను కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భైంసా ఆర్డీఓ కోమల్‌రెడ్డి, విశ్వవిద్యాలయం పరిపాలన విభాగం అధికారి రణధీర్, ఎన్ఎస్ఎస్ అధికారులు డా.విజయ్‌కుమార్, డా.శ్రవణ్‌కుమార్, డా.రమాదేవి, డా.రాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్థలం కొనేముందు.. అప్రమత్తతే మందు

నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని ఇటీవల నస్పూర్‌కు చెందిన డీకొండ అన్నయ్యకు చెందిన ఇంటిని ఒక సర్వే నంబరులో భూమి కొని మరో సర్వే నంబరులో నిర్మించారనే కారణంతో మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. అయితే నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణం చేపట్టానని బాధితుడి ఆరోపణ. భూమి కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉంటే ఇలా జరిగి ఉండేది కాదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.



దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన హరినాయక్‌కు భూమి పట్టాదారు ఫోర్జరీ సంతకాలతో పట్టా చేయించుకున్నాడని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే పట్టాదారు సంతకాలతో కొన్నేళ్ల క్రితమే పట్టా జరిగిందని హరినాయక్ వాదన. సరైన జాగ్రత్తలు పాటిస్తే బాగుండేదని అధికారులు సూచిస్తున్నారు. పైన పేర్కొన్నవి ఒక్క జిల్లాలోనే కాదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇలాంటి ఘటనలు ఇటీవల తరచూ చోటు చేసుకుంటున్నాయి.

దండేపల్లి గ్రామీణం, లక్సెట్టిపేట, న్యూస్‌టుడే

స్థలం కొనుగోలు చేసేప్పుడు సరైన జాగ్రత్తలు పాటించకపోవడం, పత్రాలు సరిగ్గా చూసుకోకపోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉంటాయి. అధికారులు తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీంతో పాటు స్థలాన్ని నష్టపోయే అవకాశాలున్నాయి. ఇటీవల రాజధానిలో హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను కూల్చివేస్తోంది. జిల్లాల్లోనూ ప్రజల్లో భూముల కొనుగోళ్లపై సవాలక్ష అనుమానాలు తలెత్తుతున్నాయి. భూమి కొనుగోలు చేసేటప్పుడు వాటి పట్టా, రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పట్టా అయిన తర్వాత దాన్ని కాపాడుకునే విధానాలపై విశ్రాంత కలెక్టర్ శర్మన్‌నాయక్, సబ్‌రిజిస్ట్రార్ సూచనలు, సలహాలు ఇచ్చారు.





జీపీఎస్ మ్యాప్ కెమెరాతో ఇట్టే తెలుసుకోవచ్చు

ఇక్కడ కనిపిస్తున్న చిత్రం జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్ ద్వారా చిత్రీకరించింది. మనం కొనుగోలు చేసిన ప్రదేశాన్ని గుర్తించడానికి ఇది తోడ్పడుతుంది. భూమి వద్దకు వెళ్లి ఫొటో తీయడం ద్వారా మనం ఉన్న ప్రదేశం అక్షాంశాలు, రేఖాంశాలు, సర్వే నెంబరు, లేదా ప్లాటు నెంబరు మనకు కనిపిస్తుంది. దాన్ని చిత్రీకరించడం ద్వారా ఫొటోపై వివరాలు నమోదవుతాయి.

ప్రభుత్వ స్థలమా, పట్టానా చూసుకోవాలి



- భూమి కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వ స్థలమా, పట్టానా అనేది ముందుగా చూసుకోవాలి.
- తహసీల్దార్ కార్యాలయంలో కొనుగోలు భూమికి సంబంధించిన రికార్డులు, పహాణీలను సరి చూడాలి.
- భూమి విక్రయించే వ్యక్తిపైనే పట్టా ఉందా, మనం కొనుగోలు చేసే భూమి అతడికి సంబంధించినదేనా అనేది పరిశీలించాలి.
- కొనుగోలు చేసిన భూమి, పట్టా భూమి ఒకటేనా అనే దానిపై సర్వే నంబర్లను పోల్చి చూడాలి.
- మొదటగా 15 ఏళ్ల క్రితం పహాణీలు, విక్రయదారుడికి భూమి ఎలా వచ్చింది, వారసత్వమా, కొనుగోలా వంటివి జాగ్రత్తగా చూసుకోవాలి.
- కొనుగోలు తర్వాత హద్దురాళ్లు ఏర్పాటు చేసుకోవాలి.

శర్మన్‌నాయక్ విశ్రాంత కలెక్టర్

కొనుగోలు సమయంలో సరిచూసుకోవాలి



- భూమి క్రయ, విక్రయాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కొనుగోలుదారుదే.
- లింకు డాక్యుమెంట్లు లేకుండా భూమి కొనుగోలు చేయడం సరికాదు.
- భూమి కొనుగోలు చేసే సమయంలో సర్వే నెంబరు, లోకేషన్, హద్దులు కచ్చితంగా చూసుకోవాలి.
- భూమికి నాలుగువైపులా ఉన్న యజమానులను విచారించడం ద్వారా మోసపోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది.
- కొనుగోలు చేసే ముందు ఇ.సి.ద్వారా భూమిపై లావాదేవీలు తెలుసుకోవచ్చు.
- ఓపెన్ ప్లాట్లకు డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలి. ఇంటి రిజిస్ట్రేషన్ సమయంలో నిర్మాణ అనుమతి పత్రం, టీఎస్‌బీపాస్ నుంచి అనుమతులు తీసుకున్న పత్రం సరిచూసుకోవాలి.
- చెరువు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భూమి ఉందా తెలుసుకోవడానికి నీటిపారుదలశాఖ, రెవెన్యూ శాఖల ద్వారా వివరాలు పొందవచ్చు.
- డబుల్ రిజిస్ట్రేషన్లకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డ్యాక్యుమెంటు ఆధారంగా సరి చూసుకునే వెసులుబాటు ఉంది.
- తాజాగా ఐజీఆర్ఎస్-తెలంగాణ పోర్టల్ ద్వారా భూమి స్వభావాన్ని తెలుసుకునే వీలు ప్రభుత్వం కల్పించింది.

జి.సాయికుమార్, సబ్ రిజిస్ట్రార్, లక్షెట్టిపేట

భారీ వర్షం.. పంటలకు నష్టం


వెంకూర్ శివారులో కోత దశలోని సోయా పంటలో నిలిచిన వర్షపు నీరు

కుంటాల, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. కోత దశలోని సోయా పంట, పత్తితీత పనులకు ఆటంకం ఏర్పడింది. వ్యవసాయ క్షేత్రాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుత తరుణంలో వర్షాలు తగ్గుముఖం పడితేనే వ్యవసాయ పనులు ముందుకు సాగుతాయి. చివరి దశలోని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. వరద నీటి రాకతో వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహించాయి. వరద నీటి రాకతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి.



బాధితులతో ఎస్పీ జానకి షర్మిల

సెయిర్‌తో సత్ఫలితాలు : ఎస్పీ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: కేంద్రం తీసుకొచ్చిన సెయిర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) వెబ్‌సైట్‌తో సత్ఫలితాలున్నాయని జిల్లా పోలీసు అధికారి జానకి షర్మిల అన్నారు. వివిధ సందర్భాల్లో చరవాణులు పోగొట్టుకున్న 65 మందికి వారి మొబైల్ ఫోన్లను మంగళవారం అప్పగించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఫోన్ పోయినా, అపహరణకు గురైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా అన్ని వివరాలతో సెయిర్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలన్నారు. దీనివల్ల చరవాణి దుర్వినియోగం కాకుండా ఉంటుందని, అదెక్కడుందో గుర్తించేందుకు మార్గం సులభమవుతుందని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 965 ఫోన్లను గుర్తించామని చెప్పారు.

ఇంకొన్ని 'చుక్కలు' చిక్కాయి!



- ఆన్‌లైన్ పెట్టుబడి వ్యవహారంలో కొనసాగుతున్న విచారణ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే:

సంచలనం సృష్టించిన ఆన్‌లైన్ పెట్టుబడుల వ్యవహారం ఇంకా కొలిక్కిరాలేదు. పోలీసులు విచారణ కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ప్రధాన వ్యక్తులుగా గుర్తించిన అయిదుగురిని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఇందులో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు కాగా, ఒకరు మాజీ సైనిక ఉద్యోగి ఉన్నారు. అరెస్టు ప్రక్రియ ముగియడంతో విషయం అంతటితో పూర్తవుతుందనుకున్నారు. కానీ, తాజాగా మరికొందరు ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అధికారికంగా స్పష్టత లేకపోయినా.. ఈ వ్యవహారంతో సంబంధమున్న వారందరూ ఉలిక్కిపడ్డారు.

కలవరపడుతూ.. కనిపించకుండా

తొలి అరెస్టు అనంతరం దాదాపు 25 రోజుల పాటు ఎలాంటి ప్రకటనలు, చర్యలు కనిపించకపోవడంతో చాలా మంది సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. తాజాగా.. మరికొందరిని అదుపులోకి తీసుకున్నారని తెలియగానే అందరిలోనూ కలవరపాటు మొదలైంది. ముఖ్యంగా స్టార్ రేటింగ్‌తో ఉన్న సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడే ఉంటే అరెస్టు తప్పదన్న భయంతో కొందరు ఇప్పటికే తామున్న ప్రాంతాలను వదిలి వేరేచోట్లకు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయ సంఘ నేతలుగా ఉన్నవారూ ఇందులో ఉన్నారనే ప్రచారం సాగుతోంది. కొందరు ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసుకున్నారు. అరెస్టుల జాబితా నుంచి తమను తప్పించేలా చూడాలంటూ పైరవీల బాట పడుతున్నారు.

కదులుతున్న డొంక..

నిన్నామొన్నటి వరకు నిర్మల్ జిల్లాలోని కడెం, ఖానాపూర్, నిర్మల్ ప్రాంతాల్లోనే ఈ తరహా వ్యవహారం ఎక్కువగా సాగుతోందనుకున్నారు. అంతా కాయిన్ రూపంలో (డాలర్లు) జరిగే తంతుకావడంతో విదేశీ కేంద్రంగా దీన్ని నిర్వహిస్తున్నారనే అనుమానాలున్నాయి. తాజాగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తినీ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.. అంటే పొరుగుజిల్లాలు, పొరుగు రాష్ట్రాల్లోనూ ఈ తతంగం సాగుతుందనేది సుస్పష్టం.

పొరుగుజిల్లా ఉద్యోగి సైతం..!

వివిధ రకాల కాయిన్‌ల పేరిట ఆన్‌లైన్ వేదికగా గొలుసుకట్టు తరహాలో సాగుతున్న ఈ తతంగం గత కొంతకాలంగా కొనసాగుతోంది. గతంలో జరిగిన ఘటనలు, మోసపోయిన బాధితులు, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీసులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రధాన సూత్రధారుడిగా భావించిన కడెం మండల వాసి, అతడికి సహకరించిన మరో నలుగురు ముఖ్య సభ్యులను ఇప్పటికే అరెస్టుచేశారు. వీరంతా ప్రస్తుతం కారాగారంలో విచారణ ఖైదీలుగా ఉన్నారు. చేర్పించిన సభ్యులు, వారి సీనియార్టీ, వస్తున్న ఆదాయం.. ఇత్యాది అంశాల ఆధారంగా ప్రధాన సభ్యులకు స్టార్ రేటింగ్ ఇస్తుంటారు. ఇలా టాప్ రేటింగ్ ఉన్నవారే ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నారు. వారి తర్వాత అదేస్థాయిలో కొనసాగుతున్న మరికొందరు సభ్యులను తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో నిర్మల్ జిల్లాకు చెందినవారే కాకుండా పొరుగునే ఉన్న ఆదిలాబాద్ జిల్లా ఒక ఉద్యోగి కూడా ఉన్నట్లు సమాచారం. పట్టుబడినవారిలో చాలావరకు ప్రభుత్వ ఉపాధ్యాయులే ఉన్నారనే ప్రచారం జరుగుతోంది.

నిండు కుండ 'కడెం'


నిండుగా జలాలతో కడెం జలాశయం

కడెం, న్యూస్‌టుడే: కడెం జలాశయం నిండా నీటితో జలకళను సంతరించుకుంది. పూర్తిస్థాయి నీటిమట్టాన్ని దాటేసింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 700 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 700.150 అడుగులకు చేరుకుంది. ఇటీవల కొంతమేర తగ్గిన నీటిమట్టం రెండు రోజులుగా కురిసిన వర్షానికి వచ్చిన వరదనీటితో మళ్లీ గరిష్ఠ మట్టాన్ని దాటింది. జలాశయం నిండానీటితో చూపరులను ఆకట్టుకుంటోంది. ఇన్‌ఫ్లో 1742 క్యూసెక్కులు వస్తోంది. ప్రధాన కాలువకు 702 క్యూసెక్కులు, కుడి కాలువకు ఎనిమిది క్యూసెక్కుల నీటిని పంటల కోసం వదులుతున్నారు. వస్తున్న ఇన్‌ఫ్లోను పరిశీలిస్తూ అవసరమైతే ఒక వరదగేటు ఎత్తుతూ నీటిమట్టాన్ని నిలకడగా ఉంచుతున్నామని అధికారులు పేర్కొన్నారు.

ప్రదర్శనలు బాగున్నాయి


వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సోఫినగర్‌లోని బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన సైన్స్ మేళాను జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. మేళాకు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు తమ ఆలోచనలను పదునుపెట్టి వివిధ అంశాల్లో తయారుచేసి తీసుకొచ్చిన ప్రదర్శనలు ఆలోజింపచేశాయి. వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించిన అదనపు కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేశారు. విద్యార్థులు నైపుణ్యంతో రూపొందించిన ప్రదర్శనలు బాగున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ సైన్స్ ప్రాముఖ్యత, భవిష్యత్తులో యువత బాధ్యతలను వివరించారు. సైన్ మేళాలో శ్రీవన్య (ప్రథమ, వికాస్ హైస్కూల్, భైంసా), పి.హాసిని (ద్వితీయ, రవీంద్ర హైస్కూల్, ముథోల్), బి.సుకృత (తృతీయ, టీజేఆర్ఎస్, సోఫినగర్), వర్ష (చతుర్థ, టీజేఆర్ఎస్, సోఫినగర్), బి.అర్చన (పంచమ, కేజీబీవీ, దిలావర్‌పూర్)లకు బహుమతులు అందజేశారు. జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపల్ డానియల్, న్యాయ నిర్ణేతలు మనోహర్‌రెడ్డి, రఫిక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

నిర్మల్: కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను మంగళవారం కలెక్టర్ అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్, పార్టీల నాయకులు కొరిపెల్లి శ్రావణ్ రెడ్డి, గంద్రత్ రమేశ్, నరేశ్, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

'హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే సహించం'

నిర్మల్, న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తిస్తే సహించేది లేదని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కోటగిరి గోపి అన్నారు. మంగళవారమిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. తితిదే లడ్డూ ప్రసాదం అపవిత్రం చేయడం సరైంది కాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పాలకులు, ఆలయాల అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. సభ్యులు నాంపెల్లి హరివర్మ, కందుల శేఖర్, శ్రీనివాస్, బ్రహ్మేంద్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలకు నోటీసుల దడ

- పెనుభారంగా ఆదాయపు పన్ను.. జీఎస్టీ





న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లావాదేవీలు, క్రయవిక్రయాలు తదితర వాటిపై ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసులు రావడంతో సంఘాలు కంగుతిన్నాయి. ఇప్పుడిప్పుడే ఎరువులు, విత్తనాల విక్రయాలతోపాటు, రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ, ఆదాయాన్ని సమకూర్చుకుంటూ.. నిలదొక్కుకుంటున్న సంఘాలకు ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు రావడంతో సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. క్రయవిక్రయాలపై వచ్చే ఆదాయంపై పన్ను చెల్లించాలని ఐటీ, సంఘాలు నిర్వహించే సేవా రంగాలు, వ్యాపార లావాదేవీలకు జీఎస్టీ నోటీసులు రావడంతో సంఘాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో వివిధ సహకార సంఘాలకు రూ. 5లక్షలనుంచి రూ. కోటి వరకు చెల్లించాలని ఈ నోటీసుల్లో పేర్కొనడంతో సంఘాలు విస్తుపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని 77 సహకార సంఘాలు రైతుల కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

గతంలో సంఘాలు కేవలం పంట రుణాల తదితర వాటికి పరిమితం కావడం, బినామీ పేరుతో చాలా మంది రుణాలు తీసుకోవడంతో సంఘాలు నష్టాల్లో కూరుకుపోయాయి. ఇప్పటికే 20కి పైగా సంఘాలు నామమాత్రంగానే ఉన్నాయి. కొన్ని సంఘాలు ఎరువులు, విత్తనాలు విక్రయించడం, రైతుల నుంచి కమీషన్‌తో పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం, పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు నిర్వహించి, ఆదాయాన్ని పెంచుకొని నిలదొక్కుకుంటున్నాయి. కొన్ని సంఘాలు రైతుల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు చేసే డిపాజిట్లు, తీసుకునే వడ్డీ పైనా పన్ను చెల్లించాలని ఆదాయ పన్ను శాఖ నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులపై స్పందించిన సహకార సంఘాలు కమిషనర్‌ను కలిసి రైతుల సేవలకు సంబంధించిన లావాదేవీలపై ఆదాయ పన్ను మినహాయించాలని వినతిపత్రం ఇచ్చినట్లు సహకార సంఘం అధ్యక్షుడు పండరి తెలిపారు.

జీఎస్టీ పరిధిలోకి..

వాణిజ్య పన్నుల శాఖ గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండేది. అప్పుడు సంఘాలు నిర్వహించే వాటిపై పన్ను ఉండేది కాదు. 2017 జులై 1 నుంచి వాణిజ్య పన్నుల శాఖ పరిధిలోని పన్నుల వసూళ్ల కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జీఎస్టీ కిందకు వెళ్లాయి. ఎరువుల విక్రయాలపై 5 శాతం, పురుగు మందుల విక్రయాలపై 18 శాతం పన్నును సంఘాలు జీఎస్టీ రూపంలో చెల్లించాల్సి వస్తోంది. గతంలో మాదిరిగానే సంఘాలు ఆదాయ వ్యయాలకు సంబంధించి లెక్కలు చూపించడం లేదు. 2017 నుంచి 2021 వరకు సంవత్సరం వారీగా ఆదాయ వ్యయ వివరాలను తెలియజేయాలంటూ నోటీసులు రావడంతో సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జీఎస్టీ నోటీసుల నేపథ్యంలో సహకార సంఘాలు చార్టెడ్ అకౌంటెంట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొని సంవత్సరం వారీగా ఆదాయ, వ్యయ లెక్కలు అప్పజెప్పే పనిలో ఉన్నాయి.

జిల్లాల వారీగా సహకార సంఘాలు

జిల్లా	ఆదిలాబాద్	నిర్మల్	మంచిర్యాల	కుమురంభీం
సంఘాలు	28	17	20	12
సభ్యులు	59,493	46,928	47,474	23,788



సుంక్లి శివారు వాగులోంచి ఎడ్లబండిపై ప్రమాదకరంగా వెళ్తున్న రైతులు

వాగు అవతల వ్యవసాయం..
రాకపోకలు ప్రమాదకరం

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సుంక్లి శివారు వాగు వర్షాలకు ఏటా ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. అయితే వాగుకు అవతలి వైపు గ్రామానికి చెందిన రైతులకు 600 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నిత్యం వ్యవసాయ పనులకు వెళ్లాలంటే కర్షకులు జల దారి దాటుకుంటూ ప్రమాదకరంగా వెళ్తుంటారు. అవతలి వైపుకు వెళ్లినప్పుడు వరద ఉద్ధృతి పెరిగితే చీకట్లో బిక్కుబిక్కుమంటూ వరద తగ్గే వరకు వేచి ఉండాల్సిందే. వర్షాకాలంలో 4 నెలలపాటు రైతుల కష్టాలు వర్ణనాతీతం. గతేడాది 15 రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు గొర్రెలు వాగు దాటలేని పరిస్థితుల్లో కాపరులు వాటిని వెంట పెట్టుకుని అవతలి వైపే ఉండిపోయారు. ఇదే క్రమంలో అనంతరం వరద నీటి నుంచి దాటుతుండగా 15 గొర్రెలు కొట్టుకుపోయాయి. ఏకధాటిగా వర్షాలు కురిసినప్పుడు 15 నుంచి 20 రోజులపాటు వ్యవసాయ పనులకు దూరంగా ఉండాల్సిన పరిస్థితులు. వ్యవసాయ పనులు అదును దాటిపోయే క్రమంలో నీటిలోంచి ప్రమాదకరంగానైనా రాకపోకలు సాగిస్తుంటారు. ప్రత్యామ్నాయ మార్గం లేక అవస్థలు తప్పడం లేదు. కనీసం లోలెవల్ వంతెన ఏర్పాటు చేయాలని గతంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులను, జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.



కొంగ తెల్లన.. తల నల్లన



పంట పొలాల్లో గడ్డి కోసం పశువులు, గింజల కోసం పక్షులు రావడం సహజం. కానీ ఇక్కడ గింజలు లేవు పచ్చని పచ్చిక మాత్రమే ఉంది. మరి పచ్చికలో ఈ పక్షులకు పనేంటి అనుకుంటున్నారా.. సారంగాపూర్ మండలం చించోలి గ్రామ శివారులోని పంట పొలంలో కనిపించిన తెల్లని శరీరం, నల్లని తల కలిగిన ఈ పక్షులను ఇబిస్ కొంగలు అంటారు. వీటి శాస్త్రీయ నామం త్రిస్ కిరోనిస్ మెలనో సెఫాలస్. దేశమంతటా తిరుగుతూ పచ్చని, తడి నేల ప్రాంతాల్లో క్రిమి కీటకాలు, మట్టిలోని చిన్న చిన్న పురుగులను ఆహారంగా తీసుకుంటాయని ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ వెల్మల మధు తెలిపారు.

- చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్

'యూబిట్ కాయిన్' వ్యవహారంలో పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడు

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : బోథ్ మండలం సొనాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని యూబిట్ కాయిన్ వ్యవహారంలో నిర్మల్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే నిర్మల్ జిల్లా పోలీసులు సొనాలలోని రామాలయం కాలనీలో రెక్కీ నిర్వహించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. సదరు ఉపాధ్యాయుడు యూబిట్ కాయిన్ వ్యవహారంలో సభ్యులను ఈ వ్యాపారంలో చేర్చుతూ స్టార్ రేటింగ్ పొందినట్లు సమాచారం. సొనాల, బోథ్ చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు నిర్మల్ జిల్లాలోని పలు మండలాల్లోని తన బంధువులను ఈ వ్యవహారంలోకి లాగి రూ.లక్షల్లో నగదును పెట్టుబడిగా పెట్టించినట్లు సమాచారం. పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే విషయం తెలియడంతో ఈ వ్యాపారంలో పెట్టుబడి పెట్టిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు.

విద్యార్థులు సేవాదృక్పథం అలవర్చుకోవాలి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుకుంటూనే సామాజిక సేవలో భాగమవడం అలవాటుగా మార్చుకోవాలని ప్రిన్సిపల్ డా.సుధాకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావం, లక్ష్యాలు, విశేషాలను వివరించారు. తమవంతుగా సమాజ సేవ చేస్తామంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అర్చన, వైస్ ప్రిన్సిపల్ యు.గంగాధర్, అధ్యాపకులు శ్రీహరి, పవన్, ఉమేశ్, సుభాశ్, శ్రీనివాస్, రజిత తదితరులు పాల్గొన్నారు.

కడెం: కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని జరుపుకొన్నారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సామాజిక సేవ ఆవశ్యకత, ప్రాధాన్యతను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రాజన్న, పీడీ స్వామి వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

భైంసా: ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ప్రిన్సిపల్ కర్రొల్ల బుచ్చయ్య అన్నారు. పట్టణంలోని జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ అబ్దుల్ హమీద్, ఎన్ఎస్ఎస్ అధికారి సంతోష్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

29న చదరంగం పోటీలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న అండర్-15 ఏళ్ల విభాగం బాలబాలికల ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి నన్నపు స్వామి, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆసక్తి ఉన్న క్రీడాకారులు చరవాణి 98487 36476, 62819 66588 నెంబర్లను సంప్రదించి తమ పేర్లను ఈ నెల 28 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆ గడియారం ఆగదు

కబీర్‌దాస్ మాటలు గుర్తు చేసుకుంటే..

'రేపు చేయాల్సిన పని ఈ రోజే చేయి. ఈ రోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేసేయ్..' అని సంత్ కబీర్‌దాస్ చెప్పిన మాట ఇప్పటికీ గుర్తు చేసుకుంటామంటే 'కాలం' ఎంత విలువైందో కదా..



అందరికీ అంతే కదా..

జీవితంలో ఏదైనా సాధించాలంటే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెబుతారు. సక్సెస్ సాధించిన వారి గురించి వివరిస్తే ఎవరికైనా 24 గంటల సమయమే ఉంటుంది. దాన్ని ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకుంటే విజయం సాధిస్తారని యువతను, విద్యార్థులను ఉద్దేశించి చెబుతారు.

నెపోలియన్ గాఢంగా నిద్రపోతున్నప్పుడు సైన్యాధిపతి వచ్చి 'శత్రుసైన్యం దక్షిణ దిక్కునుంచి చొచ్చుకొస్తోంది' అని చెబుతారు. చటుక్కున నిద్రలేచి 'అలా అయితే ఆ గోడ మీద రాసిన 64వ నంబరు పద్ధతిలో శత్రువుల్ని ఎదుర్కొండి' అని అప్రమత్తం చేస్తారు. ఏ సమయంలో ఎలా వ్యవహరించాలో ముందుగానే ప్రణాళిక చేసుకుంటే కాలం కలిసొస్తుందనేందుకు ఇది సరిపోదా..

విజయం వెనక సమయం..




రోగిని పరీక్షిస్తున్న డా.రమాదేవి

మాది నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బీరవెల్లి. వ్యవసాయ నేపథ్యమున్న అమ్మానాన్నలు కష్టపడి నన్ను చదివించారు. ఒక సాధారణ కుటుంబం నుంచి నేను ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇప్పుడు ఉస్మానియాలో పీజీ(గైనకాలజీ) చేస్తున్నానంటే దాని వెనక ఎంతో ప్రణాళిక ఉంది. ఎక్కడా సమయం వృథా చేయలేదు. వృత్తిలోనూ నాడి పట్టడం, తక్షణ చికిత్స అందించాల్సిన పరిస్థితుల్లో సమయమే ప్రధానం. -డా.రమాదేవి

● ఎవరికైనా సమయం 24 గంటలే

అదును దాటితే చీడతో పీడనే..

ఏ సమయంలో చేయాల్సిన పని ఆ సమయంలోనే చేయాలంటారు. ఇది రైతుల విషయంలోనూ చాలా కీలకం. విత్తనాలు వేయడం మొదలు కొని కలుపు తీయడం, ఎరువులు, మందులు చల్లడం వంటివి సమయానుకూలంగా చేయకపోతే దిగుబడులు నష్టం కలిగిస్తాయి.



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

నిమిషం నిబంధన తెలుసుగా..

ఆ టైమ్ ఏమొచ్చిందో ఓ గంట అటూఇటూ అని తేలిగ్గా కొట్టి పారేస్తే కుదరదండోయ్. గంట కాదు నిమిషం కూడా ఎంత కీలకమో 60 సెకన్లు ఆలస్యంగా వెళ్లి వెనుదిరిగి పోటీ పరీక్ష రాయలేక పోయిన అభ్యర్థులను అడిగి చూడండి సమయం విలువ ఏంటో చెబుతారు.

జీవితంలో ప్రతీది సమయంతో సంబంధమున్నదే. రోజూ అన్నీ దాదాపు గడియారంకేసి చూస్తూ చేసే పనులే. ఏయ్ తెల్లారింది బడికి టైం అవుతుందని అమ్మ పిల్లల్ని నిద్రలేపడం. . ఏమోయ్ నేను ఆఫీసుకి గంట ముందే వెళ్లాలి త్వరగా టిఫిన్ చేసేయ్ అని భర్త చెప్పడం.. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి పంపించరని విద్యార్థులు ముందుగానే అప్రమత్తమయ్యేవన్నీ చూస్తూనే ఉంటాం. అంతెందుకు ఏ సమయంలో పుట్టాడు.. ఎప్పుడు మరణించాడు అనే ప్రశ్నలకూ 'టైమే' కదా సమాధానం.

-న్యూస్‌టుడే, మామడ



'తమ్ముడూ టైం అవుతోంది పదా'.. బడికెళ్లే ముందు సమయం చూసుకుంటున్న నిర్మల్‌కు చెందిన చిన్నారులు మనోమయి, మోక్షిత్

కానీ గడియారం ముల్లు గుచ్చుకుంటోంది..


నిర్మల్‌కు చెందిన మడిపల్లి దక్షిణామూర్తి రేడియో వ్యాఖ్యతగా వ్యవహరిస్తారు. వివిధ సందర్భాల్లో పలు అంశాలపై ఆయన మాట్లాడుతున్నప్పుడు 'ఈ విషయంపై మరింత లోతుగా.. వివరంగా చెప్పాలని ఉంది కానీ మా స్టూడియోలోని గడియారం ముల్లు నన్ను గుచ్చుకుంటోంది..' అంటూ నవ్వుతూనే తనకిచ్చిన సమయం పూర్తవుతోందని చెబుతుంటారు.

-మడిపల్లి దక్షిణామూర్తి



ఈ అలారమే నిద్రలేపేది..

'ఈ అలారం గడియారాన్ని నేను 1990లో కొనుగోలు చేశాను. విద్యార్థి దశలో నన్ను ఉదయాల్లో నిద్రలేపింది. ఉద్యోగంలో చేరాక ప్రయాణాలు చేయాల్సి వస్తే అది మోగించిన శబ్దమే దూరంగా ఉన్న గమ్యాన్ని సకాలంలో చేరేలా చేసింది. అందుకే ఇప్పటికీ ఇంట్లో భద్రంగా ఉంచాను..' దిల్లీలోని కెనడా రాయబార కార్యాలయంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఖానాపూర్‌కు చెందిన టి.సంపత్‌కుమార్ అలారంతో ఉన్న అనుబంధాన్ని వివరించారు.





నిర్మల్‌లో ఉన్న అమ్మానాన్నలు గంగాసాగర్ రెడ్డి-అరుణ కుమారుడితో మాట్లాడుతున్నప్పుడు రాత్రి 8.20 (వెనక గోడ గడియారంలో)

ఫోన్ చేయాలన్నా టైం చూసుకోవాల్సిందే..

సాధారణంగా మనకు ఉదయం పూట ఎవరైనా ఫోన్ చేస్తే గుడ్ మార్నింగ్ అంటుంటాం. కానీ పొద్దున్నే కాల్ వచ్చిన అన్ని సార్లు శుభోదయం చెప్పడం కుదరదు. విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి చాలా మంది విదేశాల్లో ఉంటున్నారు. వాళ్ల స్వదేశంలో ఉండే తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడాలంటే తప్పకుండా 'టైం' చూసుకుంటారు. రెండు దేశాల టైంజోన్ వేర్వేరుగా ఉంటుంది. మన సమయానుకూలంగా అక్కడ ఉన్న వాళ్లకు ఫోన్ చేస్తే వాళ్లు రాత్రి గాఢ నిద్రలో ఉంటారు.



న్యూయార్క్‌లో ఉన్న ప్రశాంత్‌రెడ్డి ఫోన్‌లో తల్లిదండ్రులతో మాట్లాడుతుండగా సమయం ఉదయం 10.49 (కంప్యూటర్ తెరపై)

అలిసిపోని గడియారం..

గడియారం రోజంతా పనిచేస్తూనే ఉంటుంది. కాసేపటికే అలసి పోయామనుకునే వారు వాచీ చూసి ఉత్తేజం తెచ్చుకోవచ్చు..



గంటల ముల్లు రోజులో రెండు సార్లు చుట్టూ తిరుగుతుంది.. | నిమిషాల ముల్లు 24 సార్లు | సెకండ్ల ముల్లు 1440 సార్లు

సత్వర సేవల్లో బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్ భేష్

● రాష్ట్రంలో మూడో స్థానం



బెల్లంపల్లిలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలకు సత్వర సేవలు అందించినందుకు రాష్ట్రవ్యాప్తంగా పది పోలీస్ స్టేషన్లను ఎంపిక చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఎస్‌హెచ్ఓ దేవయ్యతోపాటు ఇతర సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించారు. వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించడం, పోలీసుల పట్ల నమ్మకం కలిగేలా చేయడం, ప్రజలకు సత్వర సేవలు అందించడాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సత్వర సేవల్లో మూడో స్థానం కేటాయించారు. ఈ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని సీపీ శ్రీనివాస్, ఐజీ ప్రత్యేకంగా అభినందించారు.

త్వరలో సీఎంతో గిరిజన, ముస్లిం నేతల సమావేశం

● మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న సీతక్క, చిత్రంలో షబ్బీర్ అలీ, వెడ్మ బొజ్జు, తదితరులు

ఈనాడు, హైదరాబాద్ : కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజనులు, ముస్లింల మధ్య శాంతియుత సంబంధాలను పునరుద్ధరించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కోరారు. జైనూర్‌కు చెందిన ముస్లిం, గిరిజన నేతలతో మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మంత్రి సీతక్కతో కలిసి మాట్లాడారు. ఈ నెల 4న చెలరేగిన మతపరమైన అల్లర్ల సమస్యను పరిష్కరించడంపై చర్చించారు. రెండు వర్గాల మధ్య సామరస్యం చెక్కుచెదరకుండా చూసుకోవాలన్నారు. ఈ నెల 28 లేదా 29న సీఎం రేవంత్‌రెడ్డితో గిరిజన, ముస్లిం నేతలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ఇరువర్గాలు తమ విభేదాలను పరిష్కరించుకుని, శాంతియుత సంబంధాలను పునరుద్ధరించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న ఇరువర్గాల నాయకులు తమ మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. ఒకరి సంప్రదాయాలు, గుర్తింపును మరొకరు గౌరవించుకోవడానికి అంగీకరించారు. ఇటీవల ఉట్నూర్, జైనూర్‌లోని గోండు ఆదివాసీ నాయకులతో సమావేశమైన మంత్రి అక్కడి అంశాలను ఈ సమావేశంలో వివరించారు. మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గిరిజన నేతలతో ఇటీవల సమావేశమైన అనంతరం వివాదానికి గల కారణాలు, శాంతిభద్రతల పునరుద్ధరణకు చేపట్టిన చర్యలను వివరిస్తూ ముఖ్యమంత్రికి తాజాగా నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, విద్యావేత్త మహబూబ్ ఆలంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

63వ జాతీయ రహదారి విస్తరణకు నిధులు మంజూరు



దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని మంగళవారం దిల్లీలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలు కలిశారు. చెన్నూరు నియోజకవర్గానికి సంబంధించి పలు రహదారులపై మంత్రితో చర్చించారు. 63వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చెన్నూరు-భీమారం మండలాల సరిహద్దున జోడువాగు వద్ద రోడ్డు విస్తరణకు రూ.100 కోట్లను మంత్రి మంజూరు చేసినట్లు వారు పేర్కొన్నారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లి వాగుపైన వంతెన నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. జోడువాగుల వద్ద రోడ్డు మరమ్మతులకు ఇదివరకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.1.80 కోట్లు మంజూరుచేసినట్లు వారు చెప్పారు.

నమోదు లక్ష్యం పూర్తిచేయాలి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: బూత్‌ల వారీగా నిర్దేశించిన భాజపా సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని బుధవారం లోపు పూర్తిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని 10వ వార్డులో మంగళవారం ఇంటింటా సభ్యత్వ నమోదు చేపట్టారు. పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో భాజపా నాయకులు, కార్యకర్తలు పర్యటించాలని, యువతను ఎక్కువగా సభ్యులుగా నమోదు చేయాలని చెప్పారు. నూతుల భూపతిరెడ్డి, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: దేశాభివృద్ధి, రక్షణ, ధర్మం, హిందువుల పరిరక్షణ భాజపాతోనే సాధ్యమని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి మెడిసెమ్మ రాజు అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా మంగళవారం మండలంలోని దుర్గానగర్ గ్రామాన్ని సందర్శించారు. పలువురితో పార్టీ సభ్యత్వం నమోదు చేయించారు.

కుంటాల: గ్రామాల్లో ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని భాజపా మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య అన్నారు. మండలంలోని కల్లూరులో మంగళవారం సభ్యత్వ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



కాల్వ గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

అపరిశుభ్రతతోనే అనారోగ్యం

దిలావర్‌పూర్: పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ప్రజలు అనారోగ్యం బారిన పడుతారని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వ గ్రామంలో పారిశుద్ధ్య మెరుగు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మిషన్‌భగీరథ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో నీటి సహాయకుల శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఎంపీడీవో అరుణకుమారి, ఎంపీవో గోవర్ధన్, ఏఈ రాజశేఖర్ మండల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

సోన్: మిషన్ భగీరథ నీటి సరఫరాపై క్షేత్ర సహాయకులకు మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శిక్షణ రెండో రోజు కొనసాగింది. జడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి గోవింద్ శిక్షకులను ఉద్దేశించి మాట్లాడారు. నీటినాణ్యతలో ఎలాంటి రాజీలేదని తెలిపారు. ఎంపీడీఓ ఎస్.సురేష్ పాల్గొన్నారు.

విధుల నిర్లక్ష్యం.. వికటిస్తున్న లక్ష్యం

● పోలీసుల్లో పెరుగుతున్న ఆశ్రిత పక్షపాతం



ఈటీవీ - ఆదిలాబాద్ : పోలీసంటే? న్యాయం, ధర్మం, బాధితుల పక్షం వహించే పవిత్రమైన విధి నిర్వహించేవారు. కానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొంతమంది అధికారుల ఆశ్రిత పక్షపాత వైఖరి ఆ శాఖకే మచ్చ తెచ్చేలా మారుతోంది. రాజకీయ అండదండలు కలిగిన కొందరు పోలీసుల వ్యవహారం ఉన్నతాధికారులకే సవాలు విసిరేలా మారుతోంది. ఇటీవల ఓ అధికారి తన అధికార దర్పంతో బినామీలను ముందుంచి రూ.కోట్లు విలువ చేసే స్థిరాస్తి దందా, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు, పెట్రోల్ బంక్‌ల నిర్వహణలో తలదూర్చిన వివాదం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిన విషయం విదితమే. ఆయనతోపాటు తాజాగా మరో అధికారి పాత్రపై ఉన్నతాధికారులు అంతర్గతంగా ఆరా తీశారు. సంబంధంలేని విషయాల్లో కొందరు తలదూర్చటంతో అపవాదును మూటగట్టుకోవాల్సి వస్తోంది.

ఆదిలాబాద్ అక్రమాలు

ఆదిలాబాద్ జిల్లా బోథ్ సర్కిల్ పరిధిలో విధుల నిర్వహణ పట్టుతప్పుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జరిగే స్థిరాస్తి వ్యాపారులకు, అంతరాష్ట్ర పరిధిలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు మీదుగా సాగే రాకపోకలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. జూద స్థావరాల నిర్వహణ, అక్రమంగా జరిగే గుట్కా విక్రయాల్లో కొందరి పాత్ర ఉన్నట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. అలాంటి ఫిర్యాదుల పైనే తాజాగా ఇచ్చోడ ఎస్ఐని ఆదిలాబాద్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు వెలువరించారు.

నిర్మల్ - తేదీ తారుమారు

నిర్మల్ డివిజన్‌లో కొందరి విధి నిర్వహణ ఇష్టారాజ్యంగా సాగుతున్నట్లు బయటపడింది. నిర్మల్ గ్రామీణ మండలంలో మూడు నెలల కిందట కారు - ద్విచక్ర వాహన ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు కారుకు బీమా లేదు. అప్పుడు కేసు నమోదు చేయలేదు. కారుకు బీమా చేశాక తేదీలు తారుమారు చేసి ప్రమాదం జరిగినట్లు చూపారు. సారంగాపూర్‌లో అనవసర విషయాల్లో తలదూర్చారనే మరో ఆరోపణ తోడవటంతో ఓ ఎస్ఐపై సస్పెన్షన్ వేటుపడింది.

మంచిర్యాల - రాజకీయం

మంచిర్యాల జిల్లాలో నాలుగు నెలల కిందటి ఘటన పోలీసుల మధ్య సమన్వయలోపాన్ని బహిర్గతం చేసింది. విధుల్లో సరిగా స్పందించలేదనే కారణంపై ఓ ఎస్ఐని బాధ్యతల నుంచి తప్పించడంతోనే సరిపెట్టారే కానీ దాని వెనుక అసలైన వారెవరనేది గుర్తించలేదు. మంచిర్యాలలో ఓపార్టీ ద్వితీయ శ్రేణి నాయకుడిపై ఏడెనిమిది మంది యువకులు దాడి చేసి గాయపర్చటం వెనుక మరో పార్టీ నాయకుల హస్తం ఉందని ప్రచారం జరిగింది. కేసులోని ప్రాధాన్యతను గుర్తించకుండా పోలీసులు మామూలుగా వదిలేశారనే ఆరోపణపై ఓ ఎస్ఐను విధుల నుంచి తప్పించి రామగుండం కమిషనరేట్‌కు అటాచ్ చేశారు.

ఆదివాసీ కోటలో

ఆదివాసీకోట ఆసిఫాబాద్‌లో కొంతమంది అధికారుల పాత్ర విమర్శలకు తావిచ్చేలా మారుతోంది. బాధితుల పక్షాన కాకుండా భయభ్రాంతులకు గురిచేసే వారినే వెనకేసుకొస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఇటీవల కాగజ్‌నగర్ డివిజన్‌లో ఓ సీఐని విధుల నుంచి తప్పించగా, తాజాగా ఆసిఫాబాద్‌లో డీఎస్పీని తప్పించిన విషయం విదితమే. సమస్యలు ఉత్పన్నమైనప్పుడే అప్రమత్తం కావటం తప్పితే అసలు కారణాలు ఆరా తీయడం లేదనే విమర్శలకు తావిస్తోంది.

విద్యావాలంటీర్ల నియామకం



మొర్రిగూడ పాఠశాలలో వీవీని నియమించి సూచనలు చేస్తున్న కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి

వందనం

కడెం, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో కాయిన్ యాప్ దందాల వ్యవహారంలో కడెం మండలం మొర్రిగూడ, గంగాపూర్(దుబ్బతండా) పాఠశాలల ఉపాధ్యాయుల అరెస్టు, రిమాండ్ నేపథ్యంలో వారిని విద్యాశాఖ సస్పెండ్ చేసింది. అసలే ఏకోపాధ్యాయ పాఠశాలలు కావడం, వారి స్థానంలో వేరే ఉపాధ్యాయులను అక్కడ నియమించలేదు. ఫలితంగా విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు లేరనే విషయమై మంగళవారం 'ఈనాడు'లో 'ఉపాధ్యాయులు జైలుకు.. విద్యార్థులు గాలికి' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డీఈఓ రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు కడెం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి మొర్రిగూడ పాఠశాలను సందర్శించారు. గ్రామానికి చెందిన ఓ యువతిని విద్యావాలంటీరుగా నియమించారు. అదేపాఠశాలకు కేటాయించిన ఐఈఆర్టీ, వీవీలకు పాఠశాలను సక్రమంగా నిర్వహించాలని సూచనలు చేశారు. గంగాపూర్(దుబ్బతండా) పాఠశాలకు సైతం విద్యావాలంటీరును నియమించినట్లు ఆయన 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఉపాధ్యాయుల నియామకం జరిగేవరకు వీవీలతో పాఠశాలలు నిర్వహిస్తామన్నారు.

మొరాయించిన టిమ్.. నిలిచిన బస్సు



విద్యానగర్ స్టాప్ వద్ద నిలిపిన ఆర్టీసీ బస్సు

ఖానాపూర్, న్యూస్‌టుడే: ఖానాపూర్ నుంచి నిర్మల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు మంగళవారం పట్టణంలోని విద్యానగర్ బస్సు స్టాప్ వద్దకు చేరుకోగానే ప్రయాణికులకు టికెట్లు ఇచ్చే టిమ్ మొరాయించింది. అప్పటికే కండక్టర్ కొంతమందికి టికెట్లు ఇచ్చారు. టిమ్ మొరాయించడంతో చేసేదేమీలేక ప్రయాణికులను బస్సు దింపేశారు. 50కి పైగా మంది ప్రయాణికులు బస్సుదిగిపోయారు. అనంతరం బస్సు డ్రైవర్, కండక్టర్ ఖాళీ బస్సును నిర్మల్ డిపోనకు తరలించారు.

కాడెద్దులపై పిడుగుపాటు



రాయపూర్‌కాండ్లిలో మృత్యువాత పడ్డ మూగజీవాలను పరిశీలిస్తున్న ఆర్ఐ బాలకిషన్, రైతులు

లోకేశ్వరం, న్యూస్‌టుడే: బసవన్నల కష్టాన్నే నమ్ముకున్న ఓ రైతు అల్లారు ముద్దుగా పెంచుకున్న కాడెద్దులపై పిడుగుపాటు తీరని శోకాన్ని మిగిల్చిన ఘటన మండలంలోని రాయపూర్‌కాండ్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు మక్కాజి లింగురాం తనకున్న రెండెద్దులతో పాటు ఒక దూడను ఆరుబయట కట్టేసి ఇంట్లో నిద్రపోయారు. సోమవారం రాత్రి మొదలైన భారీ వర్షానికి పిడుగు పడడంతో రెండు ఎద్దులతో పాటు దూడ మరణించాయి. ఉదయాన్నే నిద్ర లేచిన రైతు ఇంటి ముందు అచేతనంగా పడి ఉన్న కాడెద్దులను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఆర్ఐ బాలకిషన్ ఘటనా స్థలిని సందర్శించారు. రైతు దాదాపు రూ.2 లక్షల వరకు నష్టపోయినట్లు నివేదికలో పేర్కొన్నారు. వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఫిర్యాదులు

ఖానాపూర్, న్యూస్‌టుడే: వార్డు సమస్యలపై కనీస అవగాహన లేని భారాస వార్డు కౌన్సిలర్లు ప్రతిపాదనలు అడిగినపుడు ఇవ్వకుండా మున్సిపల్ ఛైర్మన్‌పై ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్ అన్నారు. ఖానాపూర్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే బొజ్జుపటేల్ చొరవతో టీయూటీఎఫ్ఐడీసీ నిధులు రూ.4.8 కోట్లు రానున్నాయని, వార్డుకు రూ.40 లక్షలు చొప్పున ప్రతిపాదనలు పంపాలని భారాస కౌన్సిలర్లను అడిగితే కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వదని, మాకు ఎలాంటి అభివృద్ధి అవసరం లేదని హేళన చేసి మాట్లాడారని అన్నారు. మీ తప్పిదం వల్లనే 8, 2 వార్డులు నష్టపోవాల్సి వచ్చిందని, రాజకీయ లబ్ధికోసమే ఫిర్యాదులు చేస్తూ ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. నాయకులు షబ్బీర్‌పాషా, పర్మి సురేష్, సచిన్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూది పోరాటాల చరిత్ర

నిర్మల్, న్యూస్‌టుడే : పీడీఎస్‌యూ 50 ఏళ్ల కాలంలో ఎన్నో పోరాటాలు చేసిందని ఆ సంఘ పూర్వ, ప్రస్తుత నాయకులు అన్నారు. మంగళవారమిక్కడ నిర్వహించిన ప్రస్తుత, పూర్వ నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. 50 ఏళ్లలో ఎంతో మంది విద్యార్థులు పోరాటాలు చేసి తమ ప్రాణాలు అర్పించారని, వారి ఆశయాలకు అనుగుణంగా పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 24న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ అర్ధశతాబ్దపు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నైనాల గోవర్ధన్, ఎం.శంకర్, మార్పుకోల తిరుపతి, బాపురావు, జె.రాజ్, రాజలింగం, శ్రీను, రాజేందర్, వెంకట్‌నారాయణ, జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్, సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయండి

నిర్మల్: హైదరాబాద్‌లో తలపెట్టిన పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ పూర్వఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కట్ల రాజన్న అన్నారు. మంగళవారమిక్కడ స్వర్ణోత్సవ సభ గోడప్రతులను ఆవిష్కరించారు. నాయకులు వాగ్మారే మహేందర్, స్నేహ, అశ్విని, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలే ఆరోగ్య రక్షకులు



ర్యాలీలో పాల్గొన్న డీఆర్డీవో విజయలక్ష్మి

సారంగాపూర్, న్యూస్‌టుడే : ప్రతి కుటుంబంలో ఉండే మహిళలే ఆరోగ్య రక్షకులని డీఆర్డీఓ విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అడెల్లి గ్రామాన్ని ఆమె సందర్శించారు. స్వయం సహాయక సంఘ సభ్యులతో కలిసి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పచ్చదనం, పరిశుభ్రతపై ఆమె మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఊరంత ఆరోగ్యంగా ఉంటారన్నారు. అడెల్లి మహా పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. ఆమె వెంట ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఏపీవో లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రజిత తదితరులు ఉన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

దస్తూరాబాద్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మహిళా సంఘం సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. బ్యాంకులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కోట వేణు, హెచ్ఈవో కన్నయ్య, ఏపీఎం గంగధర్, కొమురయ్య పాల్గొన్నారు.

సన్మానం

కుభీరు: తెలంగాణ పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన దొంతుల సురేశ్‌ను సిర్పెల్లి గ్రామానికి చెందిన పబ్బు ధర్మపురి, పల్సి వాసులు మంగళవారం పల్సి ఉన్నత పాఠశాలలో సన్మానించారు.

వెక్కిరిస్తున్న పారిశుద్ధ్యం



ఎక్కడికక్కడ నిలిచిన మురుగు నీరు

భైంసా గ్రామీణం: మండలంలోని బోరిగాంలో ఇటీవల పారిశుద్ధ్య పనులు పడకేశాయి. ఎక్కడ చూసినా అసంపూర్తి పనులు వెక్కిరిస్తున్నాయి. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధభరితంగా మారింది. అసలే వ్యాధులు ప్రబలుతున్న కాలంలో పట్టించుకునే వారు లేక గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వల్లో మురుగు పేరుకుపోయి వర్షపు నీరు నిలిచిపోతోంది. పిచ్చిమొక్కలు, చెత్త కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. పంచాయతీ సిబ్బంది కనీస పనులు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఊరికే నీరు ట్యాంకులే పరిమితమయ్యాయి. గ్రామంలోని ప్రధాన వైపుల డ్రైనేజీ నిండడంతో సరఫరాలో జాప్యం జరుగుతోంది. ఈ విషయమై ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా గ్రామాన్ని సందర్శించి సమస్యలను గుర్తించామని, త్వరలో పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ఆగని దొంగతనాలు

- సోమవారం రాత్రి రెండు చోరీలు
- మంగళవారం మహిళ మెడలో గొలుసు అపహరణ

భైంసా, న్యూస్‌టుడే:

భైంసా పట్టణంలో మహిళలు రహదారులపైకి రావాలంటేనే జంకుతున్నారు. ఎప్పుడు ఎక్కడి నుంచి ఏ దుండగుడు వచ్చి గొలుసు లాక్కుపోతాడో అర్థం కాని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. నామమాత్రపు గస్తీ, బస్టాండు, ప్రధాన కూడళ్ల వద్ద భద్రత విధుల్లోని పోలీసులు సెల్‌ఫోన్లలో నిమగ్నం కావడంతో దుండగులు తమ పని సాఫీగా చేసుకుపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో తరచూ చోటు చేసుకుంటున్న దొంగతనాలు, చైన్ స్నాచింగ్ ఘటనలు మరిచిపోక ముందే తాజాగా సోమవారం రాత్రి రెండు దొంగతనాలు, మంగళవారం ఉదయం మహిళ మెడలోని గొలుసు అపహరణ చోటు చేసుకున్నాయి.

తాజా ఘటనలు



ద్విచక్రవాహనంపై అనుమానితులు (సీసీ కెమెరా చిత్రం)

రాజీవ్‌నగర్‌కు చెందిన బాధిత మంజుల తెలిపిన వివరాలు ఇలా.. మంజుల మంగళవారం ఉదయం రాజీవ్‌నగర్ నుంచి ఆర్‌అండ్ బీ విశ్రాంతి భవనం పక్క నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చి ప్రాంతీయ ఆసుపత్రికి వెళుతున్నారు. విశ్రాంతి భవనం ముందుకు రాగానే వెనుకాల నుంచి ఇద్దరు దుండగులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని గొలుసు లాగారు. అప్రమత్తమైన బాధితురాలు గొలుసు ముందు భాగాన్ని గట్టిగా పట్టుకోవడంతో మంగళసూత్రం తెగి వచ్చింది. రెండు తులాల గొలుసు దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ క్రమంలో ఆమె కిందపడటంతో గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు.



మంజుల



బాధితురాలు చేతికి తెగివచ్చిన మంగళసూత్రం

ఇటీవలి గొలుసు దొంగతనాలు

✷ గత నెల 3న ఉదయం రాహుల్‌నగర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళ భైంసాలోని నిర్మల్ చౌరస్తాలో బస్సుదిగి కాలి నడకన వెళుతున్న క్రమంలో ఎదురుగా పల్సర్ వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని రెండుతులాల బంగారు గొలుసు అపహరించుకుని పారిపోయారు.

✷ గత నెల 29న ఒకే రోజు రెండు సంఘటనలు చోటు చేసుకున్నాయి. గణేశ్‌నగర్‌కు చెందిన రాణి అనే మహిళ మేదరిగల్లి మార్గంలో నడుచుకుంటూ వెళుతున్నారు. ఇద్దరు దుండగులు ఆమె మెడలోని గొలుసు లాగగా రాణించి తీవ్రంగా ప్రతిఘటించడంతో దొంగలు పారిపోయారు. అదే రోజు కొంత సేపటికి సినిమా థియేటర్ వద్ద రజిత అనే మహిళ మెడలోని గొలుసును అపహరించారు.

✷ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నప్పుడు బాధితులు ఫిర్యాదులు చేయడం, పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి పుటేజీలు విడుదల చేయడం పరిపాటిగా మారిందని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికీ దొంగలను గుర్తించకపోవడం, చోరీలను అదుపు చేయకపోవడంపై పెదవి విరుస్తున్నారు.

దొంగల కోసం గాలిస్తున్నాం:


డి.రాజారెడ్డి, సీఐ, భైంసా

తాజాగా మూడు ఘటనలపై మంగళవారం ఫిర్యాదులు అందాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ డి.రాజారెడ్డి పేర్కొన్నారు. చైన్ స్నాచింగ్ ముఠాలో నలుగురు ఉన్నారు. వారంతా మహారాష్ట్రకు చెందిన వారే. ఇంకా దొరకలేదు. నంబరు లేని ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్నారు. వారి కోసం గాలిస్తున్నాం. ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో నిఘా ఉంచుతాం.

✷ రాంనగర్‌లో నర్సయ్య అనే వ్యక్తి తన ఇంటి ముందు సోమవారం రాత్రి పూట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం మంగళవారం తెల్లవారేసరికి మాయమైంది.

✷ ద్వారకానగర్‌లోని సంపత్‌కుమార్ ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దొంగలు సోమవారం రాత్రి ఇంట్లోకి చొరబడి ఎల్ఈడీ టీవీ, హోంథియేటర్, రైస్ కుక్కర్ దొంగిలించారు.

చివరికి చేరాలంటే చెట్లు తొలగాల్సిందే..



బిలోలి-లోకేశ్వరం మధ్యలో సుద్దవాగు ప్రధాన కాలువలో ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు

లోకేశ్వరం, భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: భైంసాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీరు చివరి ఆయకట్టు రైతులకు అందక చేరేలా చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగానే డెడ్ స్టోరేజీ వరకు నీటిని ప్రధాన కాలువకు వదిలేలా ఉత్తర్వులు తీసుకొచ్చినట్లు ఇటీవల ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. ఈ మేరకు మూడు రోజుల కిందట ప్రధాన కాలువకు నీరు వదిలారు. కానీ ప్రధాన కాలవ సీసీ లైనింగ్ పనులు లోకేశ్వరం మండలం బిలోలి వరకు చేపట్టగా అక్కడి నుంచి దాదాపు 14 కి.మీ. మేర మిగిలిపోయాయి. లైనింగ్ పనులు చేపట్టని కాలువ ముళ్ల పొదలు, చెట్లతో నిండిపోయింది. నీరు చివరికి చేరాలంటే వాటిని తొలగించాల్సిందే. ఇప్పటికైనా అధికారులు కాలువకు మరమ్మతులు చేయించి యాసంగి పంటకు నీరందేలా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఇథనాల్ పరిశ్రమతో ఇబ్బందులు లేకుండా చర్యలు



మాట్లాడుతున్న జిల్లా అదనపు పాలనాధికారి కిషోర్‌కుమార్

నిర్మల్, న్యూస్‌టుడే: ఇథనాల్ పరిశ్రమతో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) కిషోర్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో దిలావర్‌పూర్ మండల రైతులు, ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. రైతుల అభిప్రాయాలు, అనుమానాలు, ప్రశ్నలకు అధికారులు, పరిశ్రమ ప్రతినిధుల నుంచి సమాధానాలు రాబట్టారు. వివరణలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సందేహాలపై శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, రైతులు, ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.



కల్లూరులో వరి పైరును పరిశీలిస్తున్న డీఏఓ అంజిప్రసాద్

సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ

కుంటాల, న్యూస్‌టుడే: వరి పైరులో సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్లను నివారించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ అన్నారు. మండలంలోని కల్లూరులో మంగళవారం క్షేత్రస్థాయిలో వరి పైరును, కోత దశలోని సోయా పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలో అగ్గితెగులు, పాముపొడ తెగులు ఉద్ధృతి కనిపిస్తుందన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్, పాముపొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ మందులు మోతాదు మేరకే పిచికారి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా లక్ష 5 వేల ఎకరాల్లో సోయా పంట సాగు చేయగా ప్రస్తుతం కోత దశలో ఉందన్నారు. వర్షాలు కొనసాగుతున్న తరుణంలో కోతలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పంట ఉత్పత్తులను నిల్వ చేసేటప్పుడు తేమ లేని చోట గాలివీచేలా ఉండే స్థలాలను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ సూచనలు చేశారు. భైంసా ఏడీఏ వీణ, ఏఈఓ గణేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుచేయండి

ముధోల్, న్యూస్‌టుడే: భైంసా డివిజన్ ఆయిల్ పాం సాగుకు అవకాశం ఉందని, ఆసక్తి ఉన్న రైతులు అధికారులను సంప్రదించాలని అదనపు పాలనాధికారి ఫైజాన్‌అహ్మద్ సూచించారు. మండలంలోని తరోడలో ఆయిల్‌పామ్ తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రాయితీపై అందించిన పరికరాలను పరిశీలించారు. ఉద్యానవన జిల్లా అధికారి రమణ, భైంసా డివిజన్ అధికారి జావిద్‌పాషా, ఆయిల్‌పాం కంపెని ఏరియా మేనేజర్ ప్రణీత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో ప్రతిభ

నర్సాపూర్(జి): ఆదిలాబాద్‌లో నిర్వహించిన శిక్షణలో నర్సాపూర్(జి) కెడెట్లు ఉత్తమ ప్రతిభ కనబర్చారని ఎన్‌సీసీ అధికారి సాయినాథ్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 23 వరకు నిర్వహించిన శిక్షణలో మ్యాప్ రీడింగ్, ఫైరింగ్, యుద్ధ విన్యాసాలలో కెడెట్లకు శిక్షణ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి విజ్ఞానమేళాకు ఎంపిక



నిర్మల్: ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ఈనెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి విజ్ఞానమేళాకు నిర్మల్ పట్టణంలోని బుధవార్‌పేట్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన విభాగ్‌స్థాయి గణిత- విజ్ఞానమేళాలో శిశువర్గ సంస్కృతి జ్ఞాన ప్రహేళికలో రాజశ్రీ, భైరి జ్ఞాపిక, లావణ్య ప్రథమ స్థానం సాధించగా, పీపీటీ పత్ర సమర్పణలో ప్రశాంత్‌రాజ్ ద్వితీయస్థానంలో నిలిచాడు. మట్టితో విగ్రహాల తయారీలో వినయ్ మొదటి స్థానం సంపాదించాడు. కిశోరవర్గ సంస్కృతి జ్ఞాన ప్రహేళికలో విద్య, శశీంద్ర, ప్రసన్న మొదటిస్థానంలో నిలిచారు. వీరంతా రాష్ట్రస్థాయికి అర్హత సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండూరు నరేశ్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారిని అభినందించారు.

భైంసా: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన విభాగ్ స్థాయి గణిత విజ్ఞాన మేళాలో పట్టణంలోని కిసాన్‌గల్లి సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానాచార్యులు ఎన్.భోజన్న తెలిపారు. బాలవర్గ సంస్కృతి జ్ఞాన క్విజ్ పోటీలో భూమా బృందం, గణిత నమూనాలో అనన్య, కిశోర వర్గంలో శంతన్, నందిని ప్రతిభచాటి ప్రథమ స్థానంలో నిలిచారు. భూపాలి, అక్షర, మైథిలి, వినోద్, శ్రీకర్, లక్ష్మణ్ ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. ఈ నెల 25న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న భైంసా విద్యార్థులు

భైంసా: విభాగ్ స్థాయి పోటీల్లో గుజిరిగల్లి సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు శిశు వర్గ విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ తెలిపారు.

నేర వార్తలు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



భూమన్న

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: నిర్మల్ మండలం అనంతపేట్‌కు చెందిన రైతు పోలీస్ భూమన్న(41) అప్పుల బాధతో మద్యం తాగి సోమవారం రాత్రి వ్యవసాయ క్షేత్రం వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. నిర్మల్ గ్రామీణ ఎస్సై జి.లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం పొలానికి యూరియా చల్లేందుకు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన తన బంధువు పోలీస్ నారాయణకు ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పారు. మద్యం మత్తులో గతంలోనూ ఇలాగే అనేక మార్లు చెప్పారని నారాయణ స్పందించలేదు. రాత్రి వరకు భూమన్న ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. మంగళవారం పొలానికి వెళ్లి చూడగా భూమన్న చెట్టుకు ఉరేసుకొని శవమై కనిపించారు. భూమన్న పెద్ద కుమారుడు కొద్ది రోజుల క్రితం డాబా నుంచి పడిపోవడంతో తలకు, కంటికి తీవ్రగాయాలయ్యాయి. ఇతని శస్త్ర చికిత్సకు అప్పులు చేశారు. ఈ విషయమై మనస్తాపానికి గురై మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డారు. కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రహదారి ప్రమాదంలో ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) చెక్‌పోస్టు సమీపంలో జరిగిన రహదారి ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. లక్ష్మణచాంద ఎస్సై సుమలత తెలిపిన ప్రకారం.. నిర్మల్‌కు చెందిన మధుకర్ మంగళవారం ఉదయం కారులో మామడ వైపు వెళ్తున్నారు. నర్సాపూర్ (డబ్ల్యూ) వద్దకు చేరుకోగానే ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న జంగ్లె మారుతిని ఢీకొట్టాడు. ఘటనలో మారుతి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం అతడిని నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. కారును అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో ప్రమాదం జరిగిందంటూ బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో మహిళ దుర్మరణం



కుంచపు లక్ష్మి

సోన్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో గృహిణి మరణించిన ఘటన మండలంలోని న్యూ బొప్పారంలో మంగళవారం చోటుచేసుకుంది. సోన్ ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం. . కుంచపు లక్ష్మి(46) ఉదయం తమ ఇంట్లోని ఇనుప కూలర్‌పై ఉన్న బీరువా తాళం చెవి కోసం వెదుకుతున్న క్రమంలో కూలర్ నుంచి విద్యుత్ ప్రసారమై విద్యుదాఘాతానికి గురయ్యారు. ఒక్కసారిగా కేకవేసి కింద పడిపోయి అపస్మారక స్థితికి చేరారు. వెంటనే భర్త ఆమెను చికిత్స కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందారని తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

ఎద్దు దొంగ అరెస్టు

భైంసా: పట్టణంలోని గోశాల నుంచి సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రెండు ఎద్దులను దొంగిలించారని సీఐ డి.రాజారెడ్డి తెలిపారు. ఈ మేరకు గోశాల బాధ్యుడు అల్లం విష్ణుశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా పట్టణంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన దగ్డే మైసాజీ అలియాస్ మహేశ్ ఎద్దులను అపహరించి పశువుల సంతలో అమ్ముకుంటున్నట్లు తేలింది. మంగళవారం అతడి వద్ద లభించిన ఒక ఎద్దును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

మానసిక ఒత్తిడిని జయించండి

భైంసా: విద్యార్థులు ఏకాగ్రతను పెంపొందించుకోవాలని మానసిక వైద్యుడు అల్లాడి సురేశ్ అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం నిర్వహించిన బాలశక్తి కార్యక్రమంలో ఒత్తిడిని జయించే అంశంపై ఆయన అవగాహన కల్పించారు. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే అన్ని విషయాలు గుర్తుంటాయన్నారు. ప్రిన్సిపల్ బి.సుమలత. అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొరం ట్రాక్టర్ పట్టివేత

ఖానాపూర్: మండలంలోని రంగపేట గ్రామశివారు అటవీ ప్రాంతంలో మొరం తీస్తున్న బ్లేడ్ ట్రాక్టర్‌ను అటవీ అధికారులు పట్టుకొని ఖానాపూర్ రేంజీ కార్యాలయానికి తరలించారు. అటవీచట్టం ప్రకారం కేసు నమోదు చేసి రూ.20 వేల జరిమానా విధించగా చెల్లించి ట్రాక్టర్‌ను తీసుకెళ్లారని ఎఫ్ఆర్వో కిరణ్ తెలిపారు.

గురుకుల ప్రిన్సిపల్స్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా జ్యోతి

నిర్మల్ పట్టణం: తెలంగాణ మైనార్టీ గురుకుల ప్రిన్సిపల్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో నిర్మల్ జిల్లా వాసికి చోటు దక్కింది. ప్రస్తుతం నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ప్రాంత స్థాయి సమన్వయకర్తగా పనిచేస్తున్న ముథోల్ టీఎంఆర్ఎస్ (తెలంగాణ ముస్లిం రెసిడెన్షియల్ స్కూల్) ప్రిన్సిపల్ డి.జ్యోతి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎంపికయ్యారు.

శ్రమదానంతో మరమ్మతు

దిలావర్‌పూర్: మండలంలోని లోలం గ్రామంలోని 6వ వార్డులో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. పలు మార్లు అధికారులకు సమస్య విన్నవించినా పరిష్కారం కాలేదు. ప్రజల ఇబ్బందులను గ్రహించిన స్థానిక యువకుడు హుస్సేన్ మొరంతో రోడ్డు వేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఆ యువకుడిని గ్రామస్థులు అభినందించారు.

పింఛన్లు వెంటనే విడుదల చేయాలి

ఖానాపూర్: ఆసరా పింఛన్లను వెంటనే విడుదల చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి కోరారు. ఖానాపూర్‌లో మంగళవారం మాట్లాడుతూ నెలలో చివరి వారం వచ్చినా పింఛన్లు ఇవ్వకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

రుణాలను తీసుకొని ఆర్థిక వృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ శోభ

ఖానాపూర్, న్యూస్‌టుడే: ఖాతాదారులు బ్యాంకులో తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఛైర్‌పర్సన్ వై.శోభ అన్నారు. ఖానాపూర్ పట్టణంలోని బ్యాంక్ శాఖను నూతన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె బ్రాంచిని పునఃప్రారంభించారు. ఖాతాదారులకు సేవలు, రుణాలు అందించడంలో ఖానాపూర్ శాఖ ఉత్తమ ప్రతిభ కనబరిచిందని అభినందించారు. బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. టీజీబీ రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావ్, మేనేజర్ పీఆర్ అశోక్, ఎల్డీఎం బి.రామ్‌గోపాల్, సీనియర్ మేనేజర్లు విలాస్, అభినయ్, కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే

ముథోల్: తానూరు మండలంలోని బెల్‌తరోడ గ్రామానికి చెందిన అనాథ బాలిక దుర్గకు ఆర్థిక సాయం చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఎమ్మెల్యే రామారావు పటేల్ కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి బాలిక బాగోగులను ఎమ్మెల్యేను అడిగి తెలుసుకున్నారు.

పనుల పరిశీలన

భైంసా గ్రామీణం: మండలంలోని హంపోలి (కె) గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఎంపీడీవో పి.సుధాకర్ రెడ్డి మంగళవారం పాల్గొన్నారు. ప్రధానవీధుల్లో తిరుగుతూ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

పరిహారం చెక్కు అందజేత

భైంసా గ్రామీణం: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన మర్రె ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మిర్జాపూర్ పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన పంట రుణం తీసుకుని బీమా ప్రీమియం చెల్లించారు. దీంతో రూ.2 లక్షల బీమా పరిహారం చెక్కును బాధిత కుటుంబ సభ్యురాలు రత్నకు మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సంచాలకులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలని ఫిర్యాదు

ముథోల్(బాసర): తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బాసర గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం బాసర పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై ఉజ్వలకు ఫిర్యాదు చేశారు. బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి సాయినాథ్‌పటేల్, మారుతిపటేల్, గ్రామస్థులు ప్రతాప్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీటిని తొలగించండి

నర్సాపూర్(జి): డ్రైడే సందర్భంగా అధికారులు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చాక్‌పల్లిలో నిల్వ నీటిని తొలగించాలని ఎంపీఓ తిరుపతిరెడ్డి గ్రామస్థులను కోరారు. నందన్, బూర్గుపల్లి (జి), పాఠశాలల్లో విద్యార్థులుమానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. నర్సాపూర్ (జి) పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.